

పిల్లల పండుగలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కరుణామయుడికి

కొత్త పంటలతో కృతజ్ఞతార్పణ



- కొత్త పంటలు సమర్పించిన రైతులు 6
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన విశ్వాసులు
- కిటకిటలాడిన చర్చి పరిసరాలు

రైతులు సమర్పించిన కొత్త పంటలు



ఆడుతూ.. పాడుతూ..

- జహీరాబాద్‌లో ఉత్సాహంగా పిల్లల పండుగ
- నియోజకవర్గ వ్యాప్తంగా 75 పాఠశాలల నుంచి 2,500 మంది విద్యార్థులు హాజరు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు 7

వడ్ల కొనుగోళ్లపై ఇంత నిర్లక్ష్యమా?

హమాలీల కొరతతో అన్‌లోడింగ్ ఆలస్యం.. మిల్లులో నిలిచిన లారీలు

పొడ్చన్‌పల్లిలో రైతుల ఆందోళన



వడ్లు కొనుగోలు చేయాలని పొడ్చన్‌పల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

పాపన్నపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుకు పంపిన వడ్లు హమాలీల కొరతతో సకాలంలో అన్‌లోడ్ కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోతున్నాయని రైతులు ఆందోళనకు దిగిన సంఘటన ఆదివారం పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లిలో చోటుచేసుకుంది. మండలంలో అతిపెద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం పొడ్చన్‌పల్లిలో ఉంది. ఇక్కడి ధాన్యాన్ని స్థానికంగా ఉన్న రైసుమిల్లుకు కేటాయించారు. మిల్లులో 8 మంది హమాలీలు మాత్రమే ఉండటంతో ధాన్యం దించుకోవడం ఆలస్యమవుతోంది. దీంతో, రెండు రోజులుగా 5 లారీలు మిల్లు వద్దే నిలచిపోవడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో స్థానిక రైతులు మిల్లు ముందున్న రోడ్డుపై ఆందోళనకు దిగారు. చెట్ల మొద్దళ్లు అడ్డంగావేసి నిప్పుపెట్టి వాహనాలు గ్రామంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేశారు. రైసుమిల్లు యాజమాన్యంతో మాట్లాడి హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. మిల్లు యజమాని ఇతర ప్రాంతాల నుంచి హమాలీలను రప్పించి ధాన్యం లారీలు ఖాళీ చేయించడంతో కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో 18,700 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

48 గంటల్లో రైతులకు బిల్లుల చెల్లింపు: మెదక్ కలెక్టర్

నర్సాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):మెదక్ జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ద్వారా 18,700 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ పట్టణంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతీరోజు కేంద్రం నుంచి నాలుగైదు లారీల వడ్లు రైసుమిల్లలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లావ్యాప్తంగా 490 కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320 ముందుగా చెల్లించి, అనంతరం రూ.500 బోనస్‌ను కూడా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. తహసీల్దార్ కె.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సర్వే.. స్లో..!

రెండో రోజు 12,735 కుటుంబాల వివరాల నమోదు

- ప్రశ్నావళిలో స్వల్ప మార్పులు
- 55 ప్రధాన.. 15 అనుబంధ ప్రశ్నలు
- ఖాతాలు ఇవ్వాల్సిన పని లేదు
- ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం



మెదక్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సమగ్ర ఇంటింటి సర్వే మెదక్ జిల్లాలో నెమ్మదిగా సాగుతున్నది. రెండో రోజు ఆదివారం అవసరమైన ఫారాలు, మార్గదర్శకాల బుక్‌లెట్లను తీసుకున్న సిబ్బంది తమకు కేటాయించిన ఎన్యురేషన్ బ్లాక్‌కు వెళ్లి సర్వే చేపట్టారు. హౌస్ లిస్టింగ్ ప్రకారం ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబాల సమాచారం సేకరించారు.

ప్రశ్నావళిలో స్వల్ప మార్పులు

సర్వే ఫార్మాట్‌లో స్వల్ప మార్పులు చేపట్టారు. తొలుత 56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలతో సర్వే ప్రశ్నావళి ఉండగా.. తాజాగా 55 ప్రధాన, 15 అనుబంధ ప్రశ్నలను పొందుపర్చారు. కోడ్ భాషలోనే వివరాలను పూరించాలని నిర్దేశించారు. ఈమేరకు ఎన్యూమరేటర్లకు మార్గదర్శకాల బుక్‌లెట్లను అందజేశారు. ప్రతీ ప్రశ్నకు సంబంధించిన కోడ్‌లను బుక్‌లెట్‌లో పొందుపర్చారు. కోడ్‌ను మాత్రమే నమోదు చేయాల్సి రావడంతో ఆలస్యమవుతోంది. బ్యాంక్ అకౌంట్ ఉందని మాత్రమే చెప్పాలని, ఖాతా వివరాలు ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో నమోదు

2011 గుణాంకాల ప్రకారం మెదక్ జిల్లాలో 1,571 ఎన్యూమరేటర్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో బ్లాక్‌లో 150 నుంచి 175 కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వే చేసేందుకు 1,600 మంది ఎన్యూరేటర్లను, 170 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఒక్కో కుటుంబ వివరాలు నమోదు చేసేందుకు సగటున 30 నుంచి 50 నిమిషాల వరకు పడుతుంది. సర్వే వివరాలను గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో, పట్టణాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు సిబ్బందిని కేటాయించారు.

18,428 ఇళ్ల సర్వే పూర్తి

జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శనివారం ప్రారంభమైంది. తొలిరోజు 5,693 ఇళ్లను సర్వే చేయగా.. జిల్లావ్యాప్తంగా రెండో రోజు ఆదివారం 12,735 ఇళ్లను ఎన్యుమరేటర్లు సర్వే చేశారు. రెండు రోజుల్లో జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 18,428 ఇళ్ల సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

వివరాల నమోదులో నిర్లక్ష్యాన్ని సహించం

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేలో అన్ని వివరాలను నిర్లక్ష్యానికి తావులేకుండా సేకరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎన్యుమరేటర్లను ఆదేశించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ప్రథమంగా చేపట్టి ఇంటింటి కుంటుంబ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనే విధంగా చైతన్యపరిచేలా విస్తృత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. ఏఇంటిని వదలకుండా పక్డబందీగా సర్వే నిర్వహించాలన్నారు. ప్రతీరోజు సర్వే పూర్తికాగానే వివరాల నమోదును సాయంత్రం ఐదుగంటలకు ప్రారంభించాలని, 6 గంటలకు పూర్తి సమాచారం జిల్లా కేంద్రానికి పంపించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ స్టిక్కర్లు..

మొక్కుబడి సర్వే!!

ఇంటింటి స్టిక్కరింగ్ పూర్తయి ప్రధాన సర్వే మొదలైనా ఇంకా గృహాలకు ఖాళీ స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం గార్లపల్లిలో ఊరు.. గృహ యజమాని పేరు, వివరాలు రాయకుండా ఖాళీ స్టిక్కర్లు గృహాలకు అతించారు. ఎవరు చూడొచ్చారులే అని ఎన్యూమరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహించడంతో సర్వే విశ్వసనీయతపైనే ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

-మునిపల్లి, (ఆంధ్రజ్యోతి)

ఎన్యూమరేటర్లకు సహకరించాలి



ఎన్యూమరేటర్లతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

పుల్‌కల్, నవంబరు 10 (అంధ్రజ్యోతి): సర్వే కోసం వస్తున్న ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. గొంగ్లూరు గ్రామంలో సర్వే జరుగుతున్న తీరును ఆదివారం ఆమె పరిశీలించారు. సర్వే ద్వారా సమగ్ర సమాచారం సేకరించడంతో సంక్షేమ పథకాల రూపకల్పనలో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం మండల కేంద్రమైన పుల్కల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు టోకెన్లు అందజేశారని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. ఏమైనా ఇబ్బందులున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో పాండు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.కిరణ్‌కుమార్, పుల్కల్ ఆర్ఐ దావుద్ ఉన్నారు.

వాహనాలు పక్కదారి!

వైద్య ఆరోగ్యశాఖలో అద్దె కార్ల దందా

- అమలుకాని జీపీఎస్ సిస్టమ్
- ఇష్టారాజ్యంగా టీ-హబ్, ఆలన వాహనాలు
- సొంత వాహనాల్లో వైద్యాధికారుల టూర్లు!
- అధికారుల జేబుల్లోకి రూ.లక్షల్లో ఎన్‌హెచ్‌ఎం నిధులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అద్దె కార్ల దందా కొనసాగుతున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు వైద్యాధికారులు సొంత వాహనాల్లోనే తిరుగుతూ అద్దె డబ్బులను జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. జీపీఎస్ సిస్టం అమలు చేయకపోవడంతో వాహనం తిరిగినా, తిరగకపోయినా ప్రతీ నెలా రవాణా భత్యం కింద రూ.33 వేలు ప్రభుత్వ సొమ్ము జేబులో వేసుకుంటున్నారు. టీ-డయాగ్నోస్టిక్ హబ్, ఆలన వాహనాలదీ అదే పరిస్థితి. జీపీఎస్ పెట్టకుండా ఇష్టారాజ్యంగా రికార్డుల్లో నమోదు చేసి ప్రతీ నెలా బిల్లులు క్లెయిమ్ చేస్తున్నారనే విమర్శలున్నాయి.

జీపీఎస్ ఎందుకు పెట్టరు?

జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) అమర్చితో వాహనం ఎన్ని కిలోమీటర్లు తిరిగింది.. ఏ క్షణం ఎక్కడ ఉందో ట్రాక్ చేయవచ్చు. ఆరోగ్య శాఖకు సంబంధించిన ప్రతీ వాహనంలో జీపీఎస్ సిస్టం ఉండాలనే నిబంధన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ.. ప్రస్తుతం జిల్లాలో ఒక్క వాహనంలోనూ అమలుకు నోచుకోవడం లేదు.

తొమ్మిది టీహబ్-వాహనాల్లో నడిచేది ఆరు..

జిల్లాలోని ప్రజల ఆరోగ్య రక్షణకు సంబంధించి 134 పరీక్ష నిర్వహణ కోసం గత ప్రభుత్వం టీ-హబ్‌ను సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల నుంచి రక్త నమూనాలను సంగారెడ్డిలోని టీ-హబ్‌కు చేర్చడం కోసం టెండర్ ద్వారా జిల్లాలో 9 అద్దె వాహనాలను సమకూర్చారు. కానీ నిత్యం హబ్‌కు ఆరు మాత్రమే వస్తుండగా మిగిలిన మూడు వాహనాలు రావడం లేదని వైద్య సిబ్బంది పేర్కొనడం గమనార్హం. కానీ, మొత్తం తొమ్మిది వాహనాలకు క్రమం తప్పకుండా బిల్లులు క్లెయిమ్ చేస్తున్నారు. వాహనాల కాంట్రాక్టర్‌కు కిలోమీటర్ ప్రకారం నెలకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ రకంగా తొమ్మిది వాహనాలకు నెలకు సుమారు రూ.6 లక్షల వరకు క్లెయిమ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దందా కొన్ని నెలలుగా జరుగుతున్నా అధికారులు పట్టన్నట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తున్నది. ఆగస్టులోనే వాహనాల టెండర్ ముగిసినా మళ్లీ పాత వారికే వాహనాల టెండర్ అప్పగించడం గమనార్హం.



జీపీఎస్ సిస్టం లేని టీ-డయాగ్నోస్టిక్ వాహనాలు

కనిపించని ఆలన వాహనం !

జిల్లాలో క్యాన్సర్, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు ఇంటి వద్దకే పాలియేటిక్ కేర్ సర్వీసెస్(హోమ్‌కేర్) అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా 'ఆలన' వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వాహనానికి ప్రతీ నెల రూ.50 వేలు వెచ్చిస్తున్నది. షెడ్యూల్ ప్రకారం వాహనంలో ఉండే డాక్టర్, స్టాఫ్ నర్సు, ఫిజియోథెరపిస్ట్ ఇంటికెళ్లి హోమ్‌కేర్ సర్వీసెస్ అందించాలి. కానీ వైద్య సేవలందించాల్సిన డాక్టర్, స్టాఫ్ నర్సు 10 నెలల క్రితం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఉన్న ఒక్క ఫిజియోథెరపిస్ట్‌తో అరకొరగా సేవలందిస్తుండగా, వాహనం మాత్రం హోమ్ సర్వీసెస్‌కు వెళ్లడం లేదని తెలుస్తోంది. కానీ ప్రతి నెలా రూ.50 వేలు వాహన యజమానికి చెల్లిస్తున్నారు.



జీపీఎస్ సిస్టం లేని ఆలన వాహనం

సొంత వాహనాల్లో వైద్యాధికారుల టూర్లు !

జిల్లావ్యాప్తంగా ఆరోగ్య పథకాల అమలు, పర్యవేక్షణ కోసం సదాశివపేట, కోహిర్, నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు దాదాపు ఆరేడుగురు ప్రోగ్రాం ఆఫీసర్లు హైర్ వాహనాల్లోనే జిల్లాలో పర్యటనలు చేయాలి. కానీ ఇందులో ఇద్దరుముగ్గురు తప్ప మిగతా అందరూ సొంత వాహనాల్లోనే పర్యటిస్తూ ప్రతి నెలా రూ.33 వేలు రవాణా భత్యం ఇతరుల పేర్లతో పొందుతున్నారనే విమర్శలున్నాయి. ఈ దందాపై కలెక్టర్, ఆరోగ్య మంత్రి చొరవ తీసుకొని విచారణ జరిపించాలని, ప్రతీ వాహనానికి జీపీఎస్ అమర్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు సీనియర్ వైద్యాధికారులు కోరుతున్నారు.

అమీన్‌పూర్ పెద్ద చెరువు

ముంపు బాధితుల ఆందోళన

- చెరువు కట్టపై రైతులతో కలిసి ప్లాట్ల యజమానుల నిరసన
- తక్షణం నీటిని దిగువకు వదలాలని డిమాండ్

పటాన్‌చెరు, నవంబరు, 10 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జీవవైవిధ్య అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాదితులు ఆదివారం చెరువు కట్టపై నిరవదిక ఆందోళనా శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం దిగివచ్చి తమకు న్యాయం చేసేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని ముంపు బాదితుల ఐక్యవేదిక చైర్మన్ చిరునామా సత్యనారాయణ, రైతులు స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 93.5 ఎకరాలు ఉండగా గత దశాబ్ద కాలంగా చెరువు నీరు దిగువకు వదలక పోవడంతో వందలాది ఎకరాల్లోని లేఅవుట్ల ప్లాట్లను, ఎకరాల కొద్ది రైతుల భూములు ముంపుకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు అలుగు మూసివేయడంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పెరుగుతోందన్నారు. దీంతో 20 కాలనీల్లోని 4వేల ప్లాట్లు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి ముంపు బాదితులకు న్యాయం చేయాలని హైడ్రా కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఆందోళనలో జేఏసీ సభ్యులు రామిరెడ్డి, బ్రహ్మానందరావు, వేణు, విజయ్, కృష్ణకుమార్, సంజయ్‌కుమార్, టీవీ రావు, గోపాల్‌రావు, రామారావు, గిరిధర్‌రావు, కృష్ణంరాజు, జీవ, వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, గణేష్, రమేష్, ఖలీముద్దీన్, సాయిబాబు, హరికృష్ణ, సురేష్, ఆకులబాలాజీ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద చెరువు కట్టపై ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు, రైతులు

పల్లెల్లో ఎనీటైమ్ మందు

- కిరాణ షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు
- అధికారుల అండదండలతో పెద్ద ఎత్తున బెల్టు షాపులు
- అధిక ధరలకు విక్రయం.. మందుబాబుల జేబులకు చిల్లు



సంగారెడ్డి క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించేందుకు మద్యం వ్యాపారులు కొత్త మార్గంలో వెళ్తున్నారు. ప్రభుత్వ విధానం ప్రకారం మద్యం దుకాణాలు పొందిన ప్రాంతాల్లో నిబంధనలకు మేరకు వ్యాపారం నిర్వహించాల్సి వుంటుంది. ఎంఆర్‌పీ ధరలు, సమయ పాలన పాటిస్తూ విక్రయాలు జరపాల్సి ఉంటుంది. ఈ విధంగా చేస్తే వ్యాపారంలో సరైన లాభాలు రావడం లేదనే ఉద్దేశంతో మద్యం వ్యాపారులు బెల్ట్ షాపులను ఎంచుకుని విక్రయాలు పెంచుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా గల్లీకో బెల్ట్ షాప్ కొనసాగుతోంది. మొత్తం 29 మండలాలు ఉండగా, 601 రెవెన్యూ గ్రామాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4500 వరకు బెల్ట్ షాపులు కొనసాగుతున్నట్టు అంచనా. గ్రామాల్లో చిన్న కిరాణ కొట్టు మాదిరిగా కొనసాగిస్తున్నా అందులో దొరకని మద్యం బ్రాండ్ అంటూ ఉండదు. మద్యం షాప్‌లు సమయ పాలన పాటించాల్సి ఉంటుంది. కానీ బెల్ట్ షాప్‌లకు మాత్రం ఎటువంటి సమయపాలన అవసరం లేదు. ఎనీ టైం మందు అనే విధంగా నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కూడా మందు లభ్యమవుతోంది. ఈ విషయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల చేసిన మెరుపు దాడుల్లో బహిర్గతమైంది. లక్షలాది రూపాయల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు.

అధిక ధరలకు విక్రయాలు..

మద్యం దుకాణాల్లో అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు అమ్మకాలు కొనసాగించాల్సి వుంటుంది. కానీ బెల్ట్ షాప్‌లకు తరలించి అక్కడ అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం వ్యాపారులు క్వార్టర్‌పై రూ.20, హాఫ్ బాటిల్‌కు రూ.40, ఫుల్ బాటిల్‌పై రూ.80 అదనంగా బెల్ట్ షాప్‌లకు విక్రయిస్తున్నారు. ఇక బెల్ట్ షాప్‌ల నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.30, హాఫ్‌పై రూ.60, ఫుల్ బాటిల్‌పై రూ.120లకు పెంచి మందుబాబులకు అమ్ముతున్నారు. ఒక్కో బీర్ బాటిల్‌పై రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోని మద్యం ప్రియులు సమీప పట్టణానికి వెళ్లి వస్తే ప్రయాణ చార్జీలు అంతే అవుతాయని, పైగా సమయం వృథా అవుతుందనే ఉద్దేశంతో బెల్ట్ షాప్‌లలోనే కొనుగోలు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారులకు భారీగా ముడుపులు

ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహిస్తే తమకేం మిగులుతుందని ప్రశ్నిస్తూ మద్యం వ్యాపారులు బెల్ట్ షాపుల బాట పడుతున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినప్పటికీ వారు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎక్సైజ్ అధికారులే గ్రామాల్లో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మద్యం అమ్మకాలు పెంచాలంటూ మద్యం వ్యాపారులకు అధికారులు టార్గెట్ విధిస్తున్నారు. దీంతో వారు విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను కొనసాగిస్తున్నారు. ఫలితంగా మద్యం వ్యాపారులు, బెల్ట్‌షాపుల నిర్వాహకుల నుంచి సంబంధిత అధికారులకు ప్రతి నెలా పెద్ద మొత్తంలో ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహిస్తూ అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేస్తున్నారు. కానీ ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చిందీ? ఏ దుకాణం నుంచి వచ్చిందీ? అనే విషయాలపై ఆరా తీయడం లేదు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసినా రెండుమూడు రోజుల తర్వాత మద్యం అమ్మకాలు మళ్లీ యథావిధిగా కొనసాగిస్తున్నారు. దీనికి కారణం ఎక్సైజ్ అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయనే ధీమాతోనే అనిఏ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్‌షాపులపై కొరడా ఝుళిపిస్తారో లేక మరింతగా కరుణిస్తారో చూడాలి మరి.

కరుణామయునికి కృతజ్ఞతార్పణ

- కొత్త పంటలు సమర్పించిన రైతులు



భక్తులకు దైవ సందేశమిస్తున్న బిషప్

మెదక్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చి భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం మెదక్ చర్చిలో కోతకాలపు కృతజ్ఞతార్పణల పండగ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చర్చిని మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి కొమ్మలు, ప్రత్యేకమైన పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తుల ప్రార్థనలతో మెదక్ చర్చిలో సందడి నెలకొన్నది. క్రైస్తవులు యేటా పంట తమ చేతికందే సమయంలో ప్రథమంగా వచ్చే పంటఫలాన్నీ దేవుడికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి కూడా కోత కాలపు కృతజ్ఞతార్పణల పండగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ), మెదక్ అధ్యక్ష మండలం (డయాసిస్) పరిధిలో వివిధ జిల్లాల నుంచి క్రైస్తవులు పంట ఉత్పత్తులను తీసుకొచ్చి కరుణామయుడుకి సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ రూబెన్మా మార్క్ మాట్లాడుతూ మనకు వచ్చిన పంటలలో ప్రతి ఏడు పది శాతం దేవుడికి సమర్పించడం మనకు అంతకంటే ఎక్కువే ప్రసాదిస్తాడని అన్నారు.



హాజరైన భక్తులు

ప్రాణం తీసిన చేపల పంచాయితీ

- రెండు గ్రామాల మధ్య కొనసాగుతున్న వివాదం
- చేపలు పట్టడానికి వెళ్లిన వర్దరాజ్‌పూర్ గ్రామస్థులు.. తరిమికొట్టిన ధర్మారంవాసులు
- పారిపోతూ చెరువులో పడి వ్యక్తి మృతి



సత్తయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల మధ్య నెలకొన్న చేపల పంచాయితీ.. ఓ వ్యక్తి మృతికి కారణమైంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం ధర్మారం, మర్కుక్ మండలం వర్దరాజ్‌పూర్ గ్రామాల మధ్య బోరబండ ప్రాజెక్టు ఉంది. ఇందులో చేపలు పట్టే విషయంలో రెండు గ్రామాల మధ్య కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతున్నది. ఈ పంచాయితీపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదులు సైతం చేసుకున్నారు. కాగా, శనివారం వర్దరాజ్‌పూర్ గ్రామానికి చెందిన వారు బోరబండ ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వెళ్లారు. గమనించిన ధర్మారం గ్రామస్థులు పెద్ద ఎత్తున ప్రాజెక్టు వద్దకు చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం దాడికి దారి తీసింది. దీంతో వర్దరాజ్‌పూర్ గ్రామస్థులు ప్రాజెక్టు నుంచి పరుగులు పెట్టారు. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన ముచ్చపతి సత్తయ్య(55) అక్కడి నుంచి తప్పించుకునే సమయంలో ప్రమాదవశాత్తు ప్రాజెక్టులో పడ్డాడు. దీన్ని ఎవరు గమనించకపోవడంతో కుటుంబీకులు రాత్రి సత్తయ్య గురించి ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో వర్దరాజ్‌పూర్ గ్రామస్థులు ఆదివారం ఉదయం బోరబండ ప్రాజెక్టు వద్దకు వెళ్లి వెతకసాగారు. ఈ క్రమంలో చేపలు పడుతున్నారని మళ్లీ ధర్మారం గ్రామస్థులు అక్కడికి చేరుకోవడంతో బోరబండ ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రెండు గ్రామాల ప్రజలను చెదరగొట్టారు. అనంతరం సత్తయ్య కనబడడంలేదని కుటుంబ సభ్యులు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోరబండ ప్రాజెక్టు వద్ద సత్తయ్య పాదరక్షకులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా.. నీటిలో సత్తయ్య మృతదేహం సాయంత్రం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు!

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరిగిపోయిన గంజాయి అమ్మకం, సేవించే వ్యక్తులపై పోలీసులు దృష్టి పెట్టారు. తూప్రాన్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇతర రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిని, గంజాయి సేవించే పది మంది యువకులను ఆదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

సాహో సహకారం

ఆదర్శం.. హుస్నాబాద్ సహకార సంఘం

- రూ.25 కోట్ల టర్నోవర్, రూ.77 కోట్ల ఆస్తులు
- రైతుల సంక్షేమం, లోన్లు, వ్యాపారాల్లో మేటి
- రూ.2.80కోట్లతో నూతన భవనం

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒకనాడు సిబ్బందికి జీతాలు ఇవ్వని పరిస్థితి.. కనీసం కూర్చుందామంటే కుర్చీలు కూడా లేని దుస్థితి.. పేరుకు సహకార సంఘమైనా సభ్యుల మనుగడ ప్రశ్నార్థకం.. చైర్మన్, డైరెక్టర్ పదవులూ అలంకార ప్రాయమై.. ఇటువంటి దయనీయమైన పరిస్థితుల్లో ఉన్న ఆ సంఘం నేడు కోట్ల టర్నోవర్‌తో ఆదర్శంగా నిలుస్తున్నది. 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన కొన్ని నిధులతో ఒక వైపు రైతుల సంక్షేమం.. మరో వైపు వ్యాపారం చేస్తూ నేడు రూ. 25 కోట్ల టర్నోవర్‌తో, రూ. 77 కోట్లకు పైగా ఆస్తులతో ముందుకు దూసుకపోతున్నది హుస్నాబాద్ సహకార సంఘం. దీని పరిధిలో 52 గ్రామాలతో పాటు 4,478 మంది సభ్యులున్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు భారత సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 17న రూ.2.80 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభిస్తున్నారు.



సహకార సంఘ ఫర్టిలైజర్ దుకాణం

1959లో సంఘం ప్రారంభం..

హుస్నాబాద్ సహకార పరపతి సంఘం ఫిబ్రవరి 14, 1959లో మాజీ శాసన సభ్యుడు దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. అప్పటి నుంచి రైతులకు ఈ సంఘం ద్వారా అనేక రకాల సేవలందుతున్నాయి. కొన్ని సంవత్సరాల అనంతరం సహకార సంఘాలను పట్టించుకోని కారణంగా ఇచ్చిన అప్పుల వసూళ్ల వరకే పరిమితమయ్యాయి.



నూతనంగా నిర్మించిన సహకార సంఘ గోదాం

జీతాలు ఇవ్వలేని పరిస్థితి..

2005 సంవత్సరానికి ముందు సంఘం నష్టాల్లో ఉండడంతో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి. దీంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ రైతుల రుణమాఫీ చేయడమే కాకుండా దీనికి రూ. 1.68 కోట్లు ఇచ్చారు. ఈ నిధులతో రైతుల అవసరమైన ఎరువులు, విత్తనాలు ఇవ్వడం, ఓ వైపు వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే మరో వైపు పట్టణంలో వివిధ రకాల వ్యాపారాలు మొదలు పెట్టారు. అప్పుడే కందులు, వరి, మొక్క జొన్నల కొనుగోళ్ల సంఘానికి అప్పజెప్పడం.. కమీషన్లు వస్తుండటంతో ఆర్థికంగా బలోపేతం అయ్యింది.

ప్రారంభానికి సిద్ధంగా నూతన భవనం..

పాత సహకార సంఘ భవనం వెనుక నాబార్డు ద్వారా రూ. 2.80కోట్ల రుణం తీసుకొని జీప్లస్‌వన్‌తో నిర్మించిన సహకార సంఘ భవనం, గోదామును ఈ నెల 17వ తేదీన మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. 14 నుంచి 20 వరకు జరిగే భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అలాగే కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సంఘ వ్యవస్థాపకుడు దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు.

రూ. 77 కోట్ల ఆస్తులు..

ఈ సంఘానికి దాదాపు రూ. 77 కోట్ల ఆస్తులున్నాయి. ఇందులో హుస్నాబాద్ పట్టణంలో రైసుమిల్లు గోదాం, షాపింగ్ కాంప్లెక్స్, స్ట్రాంగ్ రూమ్, పట్టణంలో పీపీబీసీ గోదాం, పందిల్లలో ఆర్‌సీసీ గోదాం, మల్లంపల్లిలో ఆర్‌సీసీ గోదాం, పోతారం (ఎస్)లో షేర్ రూఫ్ గోదాంలు ఉన్నాయి. అలాగే అంతకపేటలో పెట్రోల్ బంకుతో పాటు నూతన సహకార సంఘ భవనం, గోదాం తదితర ఆస్తులున్నాయి.

ఓ వైపు రైతుల సంక్షేమం.. మరో వైపు వ్యాపారం..

రైతులకు ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు వారి నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. చిరువ్యాపారులకు రుణాలు, గోల్డ్, హౌజింగ్, వెహికిల్స్ లోన్ల వంటి వ్యాపారాలతో పాటు అక్కన్నపేట మండలం అంతకపేటలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఈ మూడు నెలల కాలంలోనే రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. ఏటా రూ.76.31 లక్షల ఎరువులు, విత్తనాలు రైతులకు విక్రయిస్తున్నారు. సహకార సంఘం ద్వారా 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సంవత్సరానికి రూ. కోటి కమీషన్ వస్తుంది. పట్టణంలోని హన్మకొండ రోడ్డులో 23 షట్టర్ల భవన సముదాయాన్ని నిర్మించగా దీని ద్వారా ఏడాదికి రూ.22.44 లక్షల కిరాయి వస్తుంది. సంఘం ద్వారా రైతులతో పాటు మొత్తం రూ.18.19 కోట్ల వివిధ రకాల రుణాలు ఇచ్చారు. కాగా ఈ సంవత్సరం అన్ని ఖర్చులు పోనూ. రూ. 1.48 కోట్ల లాభం సంఘానికి వచ్చింది. సంఘంలో లాకర్ సౌకర్యం ఉంది. రూ.78 లక్షల డిపాజిట్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం రూ. 25 కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుంది.



అందరి సహకారంతోనే..



రైతులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధుల సహకారం వల్లే ఇంత అభివృద్ధి సాధించాం. రైతుల సంక్షేమాన్ని చూసుకుంటూనే సంఘం ద్వారా వ్యాపారం చేయడంతో ప్రస్తుతం రూ. 25 కోట్ల టర్నోవర్ ఉంది. రూ.77 కోట్లకు పైగా ఆస్తులు కూడా ఉన్నాయి. అన్ని రకాల రుణాలు ఇస్తున్నాం. మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. రైతుల కోసం విత్తనశుద్ధి కార్మాగారం, ఒక రైస్‌మిల్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది.

-బొలిశెట్టి శివయ్య, చైర్మన్

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి బైక్ రైడర్ మృతి

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆగి ఉన్న లారీని గమనించిక ఢీకొట్టడంతో బైక్ రైడర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ రాక్‌హిల్స్‌కు చెందిన ధల్జిత్‌సింగ్ (37), సఫిల్‌గూడ్ మల్కాజిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాగర్ సంతోష్‌గౌడ్ వేర్వేరు వాహనాలపై బైక్ రైడ్‌కు ఆదివారం ఉదయం బయలుదేరారు. హైవే 44 మీదుగా వెళ్తుండగా తూప్రాన్ పట్టణ శివారులోని కరీంగూడ చౌరస్తా వద్ద పార్కింగ్ లైట్లు, ఇండికేటర్లు లేకుండా రోడ్డుపై నిలిపిన లారీని ధల్జిత్‌సింగ్ బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో మేడ్చల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి కుల్వంత్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొట్టి వ్యక్తి..



మృతి చెందిన సత్తయ్య

బెజ్జంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గాగిల్లాపూర్ రాజీవ్ రహదారి స్టేజి సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఆకేన సత్తయ్య (65) వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో తన బంధువుల ఇంటికి బైకుపై వెళ్లి ఆదివారం స్వగ్రామానికి వస్తున్నాడు. గాగిల్లాపూర్ స్టేజి సమీపంలోకి రాగానే హైదరాబాదు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు బైకును వెనుక నుంచి ఢీకొట్టడంతో సత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం, ఆటో ఢీకొని.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపజేసిన మంత్రి పొన్నం



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గజ్వేల్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డీసీఎం ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణానికి చెందిన పెద్దమ్మ, కనకవ్వ, స్వప్న ముగ్గురు హైదరాబాద్ నుంచి పూలు తీసుకుని వస్తుండగా మార్గమధ్యలో గజ్వేల్ మండలం కొడకండ్ల రాజీవ్ రహదారిలో 400 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ముందుగా వెళ్తున్న డీసీఎంను ఆటో ఢీకొట్టగా ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమాదాన్ని గ్రహించి దగ్గరుండి క్షతగాత్రులు అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపజేశారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

గురుకులాల జోనల్ స్థాయి క్రీడలకు సర్వం సిద్ధం

మెదక్ అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికల) మైదానంలో సోమవారం నుంచి 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సువర్ణలత తెలిపారు. ఆదివారం మైదానంలో ఆమె ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశాల మేరకు సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలోని 13 గురుకులాలు, కళాశాలల నుంచి 1100 మంది క్రీడాకారులు పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. అండర్- 14, 17, 19 మూడు విభాగాల్లో పరుగు పందెం, డిస్కస్‌త్రో, లాంగ్, ఐ జంప్ కబడ్డీ, ఖోఖోతోపాటు అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. 13 మంది పీడీలు, 13 మంది పీఈటీలతోపాటు క్రీడల నిర్వహణకు 15 కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించార్పు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మదూరు విద్యార్థులు





అంకిత, రమేష్

చిన్నశంకరంపేట, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు చిన్నశంకరంపేట మండలంలోని మదూరు హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లి నరేష్ ఆదివారం తెలిపారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు సీహెచ్ అంకిత, రమేష్ చేగుంట మండల కేంద్రంలో శనివారం జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఆ విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

బందారం విద్యార్థిని..



లక్ష్మి ప్రసన్న

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి ప్రసన్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీ

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

హుస్నాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను ప్రోత్సహించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో మూడురోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్ -14 బాల, బాలికల హ్యాండ్ బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగం ఫైనల్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా వరంగల్ విజయం సాధించింది. బాలికల విభాగంలో ఆదిలాబాద్, వరంగల్ జట్లు పోటీపడగా ఆదిలాబాద్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి కెబినెట్ ఆమోదం తెలిపిందని, ఇందులో క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారికే ప్రవేశం ఉంటుందన్నారు. హుస్నాబాద్ నుంచి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలన్నారు. హుస్నాబాద్ స్టేడియం క్రీడలకు వేదిక కావాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంఈవో మనీల, కమిషనర్ మల్లిఖార్జున్, నిర్వాహకులు రాగుల శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య, బూట్ల రాజమల్లయ్య, చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, పద్మ, సరోజన పాల్గొన్నారు.

ఆడుతూ.. పాడుతూ..

- ఉత్సాహంగా పిల్లల పండుగ ● పాల్గొన్న ఐజీపీ సుమతి

జహీరాబాద్, నవంబరు 10 : జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌ఎల్లార్ పాఠశాలలో శ్రామిక విజ్ఞాన కేంద్రం, చిల్డ్రన్ ఫెస్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పిల్లల పండుగ ఘనంగా జరిగింది. నియోజకవర్గంలోని 75 పాఠశాలలకు చెందిన 2500 మంది విద్యార్థులు హాజరై పాటలు, కోలాటం, ఏకపాత్ర అభినయం, మ్యూజిక్, డ్రాయింగ్, కథలు, మట్టి బొమ్మల తయారీ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్ ఐజీ సుమతి ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో పిల్లల్లోని సృజనాత్మకత బయటపడుతుందని పేర్కొన్నారు. శ్రామికవిజ్ఞాన కేంద్రం, చిల్డ్రన్స్ ఫెస్ట్‌కమిటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.



మట్టిబొమ్మల తయారీ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



పిల్లల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఐజీ సుమతి

కేతకీలో పూజలు..

ఝరాసంగం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర ఐజీ సుమతి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి

కల్హేర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంగారెడ్డి జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి అన్నారు. కల్హేర్, సిర్గాపూర్‌లలో ఉన్న ఎస్సీ బాలర సంక్షేమ వసతి గృహాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. వసతుల గురించి వార్డెన్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, వంట వస్తువులు, తాగునీటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అందాల్సిన వస్తువులు, బియ్యం, కూరగాయలు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ గృహాల్లో చదివే విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట డివిజనల్ సహాయ సంక్షేమ అధికారి చందా శ్రీనివాస్ ఉన్నారు.



కల్హేర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో అఖిలేష్‌రెడ్డి

కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటాలే శరణ్యం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు తొత్తులుగా మారి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటలే శరణ్యమన్నారు. ఆదివారం స్థానిక ఐలా భవన్‌లో ఏర్పాటు చేసిన కిర్బీ కార్మికుల యూనియన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో ప్రభుత్వాలు నడుపుతున్న పాలకులు తిరిగి ఏం చేస్తున్నారో వివరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాజయ్య, పాండురంగారెడ్డి, వీఎస్.రాజు, నాగప్రసాద్, ఏడుకొండలు, లఖాన్, లక్ష్మన్, వెంకట్, జైపాల్, మహేశ్వర్ రెడ్డి, మల్లేశం, తలారిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

క్రైం కార్నర్

నీట మునిగి బాలుడి మృతి

జహీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ఈతకు వెళ్లి నీట మునిగి బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మల్‌చెల్మ గ్రామానికి చెందిన ఇలియాస్(17) కుటుంబంతో జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీలో నివాసముంటున్నాడు. ఆదివారం మల్‌చెల్మ గ్రామ శివారులోని ఈరన్నవాగు చెరువులోకి స్నేహితుడితో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి మామ షాకిర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన కారు

కొండపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ శివారులో కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు మిత్రుడైన కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన సాయిగణేష్ ఇంటికి శనివారం రాత్రికి వచ్చారు. వారితోపాటు సాయిగణేష్ తెల్లవారుజామున కారులో సిద్దిపేటకు వెళ్లి తిరిగి సిరిసినగండ్ల గ్రామానికి వస్తున్నారు. మర్పడగ శివారులో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయే ప్రయత్నంలో కారు అదుపుతప్పి చెరువు కట్ట కిందికి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సాయిగణేష్, రోహన్, రాహుల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

మూడు రహదారులకు మహర్దశ

- ఎల్ఈడీ పార్క్ నుంచి కొడకంచి రోడ్డుకు రూ.3 కోట్లు
- వావిలాల పీర్లా చెరువుకట్ట పైనుంచి జగంపేటకు రూ.1.56 కోట్లు
- రాళ్లకత్వతండాకు రూ.1.80 కోట్లు మంజూరు



కొడకంచి శివారు నుంచి ఎల్ఈడీ పార్క్ వరకు కొనసాగుతున్న రోడ్డు పనులు

జిన్నారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలో కీలకమైన మూడు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రయాణికులకు దూరభారం తగ్గడంతో పాటు ఆయా గ్రామాలు అభివృద్ధిలో కీలకం కానున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ఎల్ఈడీ పార్క్‌కు సరైన రోడ్డు సౌకర్యం లేక లక్ష్యం నెరవేరని తరుణంలో నిధులు మంజూరయ్యాయి. హైదరాబాద్‌కు మండలవాసులు అత్యధికంగా వినియోగించే వావిలాల పీర్లా చెరువు కట్ట పైనుంచి రోడ్డు అభివృద్ధికి మోక్షం లభించడంతో మండల రహదారులకు మహర్దశ రానున్నది.

రహదారులకు మోక్షం

జిన్నారం మండలం శివానగర్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ పార్క్ పారిశ్రామిక ప్రాంతానికి సరైన రోడ్డు సౌకర్యం లేక పరిశ్రమల స్థాపనలో లక్ష్యం నెరవేరడం లేదు. శివానగర్ నుంచి ఓ రోడ్డును ఏర్పాటు చేసినా కొడకంచి వైపు నుంచి ప్రధాన రహదారి అభివృద్ధి జరగలేదు. సుమారు 2 కిలోమీటర్ల మేర కంకర రోడ్డే ఉండడంతో ఎల్ఈడీ పార్క్‌కు చేరుకోవాలంటే ఇక్కట్లు తప్పటం లేదు. అయితే ఈ రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. డెక్కన్ ఆటో పరిశ్రమ శివారు నుంచి ఎల్ఈడీ పార్క్ వరకు రోడ్డు అభివృద్ధి చెందితే పరిశ్రమల స్థాపన పూర్తిస్థాయిలో జరిగి ఉపాధి, వ్యాపార కార్యకలాపాలు జోరుగా సాగే అవకాశం ఉన్నది. అలాగే వావిలాల, జంగంపేట మధ్య గల పీర్లా చెరువు కట్ట అభివృద్ధికి రూ.1.56 కోట్లను మంజూరు చేశారు. రెండు గ్రామాల మధ్య ఇప్పటికే నూతన కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కట్టపై రోడ్డును అభివృద్ధి చేస్తే 10 గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గనున్నది. రాళ్లకత్వ గ్రామం నుంచి తండా వరకు రూ.1.80 కోట్లతో రహదారి అభివృద్ధి చేపట్టనున్నారు. గ్రామ శివారులో ఉన్న జనావాసాలకు రహదారి అభివృద్ధితో స్థానిక రూపురేఖలు మారనున్నాయి. మండలంలో కీలకమైన మూడు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధితో గ్రామాలకు మేలు

జిన్నారం మండలంలో మూడు ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.6.36 కోట్ల నిధుల మంజూరు చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మేలు జరగనున్నది. వావిలాల, పీర్లా చెరువు కట్ట రోడ్డుతో పాటు ఎల్ ఈడీ పార్క్ రహదారి అభివృద్ధితో ఆయా ప్రాంతాల మధ్య దూర భారం తగ్గటంతో పాటు పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది. పనులకు సంబంధించి త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభం కానున్నది.

- రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ

న్యూస్ బాక్స్

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

- సంగారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ స్వామి

సంగారెడ్డి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పరిధిలో గల 11కేవి ఫీడర్ విద్యుత్ తీగలపై చెట్లను తొలగించడం (ట్రీ ట్రిమ్మింగ్), ఇతర మరమ్మతుల పనుల నిమిత్తం ఈ నెల 11న విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సంగారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని వీరభద్రానగర్, ఎఫ్ఆర్ఎస్, విజయనగర్ కాలనీ, ఐబీ వెనుకభాగం, రుక్మిణీ థియేటర్ ప్రాంతం, హాస్టల్ గడ్డ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కాలనీవాసులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'మేలుజాతి పశు సంపద పెంపునకు కృషి చేయాలి'

కంగ్టి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేలుజాతి పశు సంపద పెంపు కోసం కృషి చేయాలని పశు వైద్యాధికారి ముస్తాక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జీర్గితండాలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సహకారంతో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతిఒక్కరూ నాణ్యమైన పాలనే వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, రాజేందర్, మోహీన్ పాల్గొన్నారు.

గ్రౌండ్ పనులు పరిశీలన

రాయికోడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లాపూర్ చౌరస్తాలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను రెండురోజుల క్రితం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకస్మిక తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఆడుకునేందుకు గ్రౌండ్ బాగా లేదని విద్యార్థులు మంత్రికి వివరించారు. మంత్రి ఆదేశాల మేరకు జరుగుతున్న గ్రౌండ్ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య ఆదివారం పరిశీలించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల పరిధి పీపడ్‌పల్లికి చెందిన లాలూబి(19)ని మంత్రి ఆదేశాల మేరకు అంజయ్య పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు సుభాష్‌పాటిల్, విఠల్, కృష్ణ, బాబుకుమార్, బాసిత్‌పటేల్, బసలింగప్ప, స్వామిదాస్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే గృహంలో గురు పాదుకార్చన

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేడు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఇంటి ఆవరణలో పసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో గురు పాదుకార్చన నిర్వహించనున్నట్లు విద్యాపీఠం బాధ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పూజలు ఉంటాయని, అందువల్ల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజు

వెల్దుర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్ విధించామని ఎస్ఐ రాజు తెలిపారు. వెల్దుర్తి పట్టణానికి చెందిన జీతయ్యగారి లక్ష్మణ్ శనివారం కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి కూలీ పనికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉన్నది. లోపలికి వెళ్లి కూడగా బీరువాలో ఉన్న రూ.25 వేలను ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా లక్ష్మణ్ ఇంటి పక్కన ఉంటున్న విజయ్‌కుమార్‌ను విచారించగా.. దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నగదును స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతిచెందిన గేదె

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలం బాచేపల్లికి చెందిన రైతు గుగులోత్ కిషన్‌నాయక్‌కు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందింది. కిషన్‌నాయక్ రోజులాగే తన గేదెను పంట చేనులో మేపుతుండగా బోరు మోటారుకు కనెక్షన్ ఉన్న విద్యుత్ తీగను తాకడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు తెలిపాడు. గేదె విలువ రూ.80 వేల ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

కళలతో మానసిక ప్రశాంతత: నిర్మలాజగ్గారెడ్డి



కళాకారులను అభినందిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కళలతో మానసిక ప్రశాంతత పెరుగుతుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన నృత్య పోటీలో సంగారెడ్డికి చెందిన కళాకారులను ఆమె అభినందించి మాట్లాడారు. సమాజ మార్పులో కళలు, కళాకారుల పాత్ర కీలకమన్నారు. రంగస్థలంలో పాత్రకు సినిమా, కెమెరా ముందు డైలాగ్‌కు చాలా వ్యత్యాసం ఉంటుందని, పాత్రకు జీవం పోసేది రంగస్థలమేనని అన్నారు. అనంతరం నృత్య భారతి డైరెక్టర్ డా.తల్వార్ మల్లేష్ మాట్లాడుతూ సంప్రదాయ కళలైన కూచిపూడి, భరతనాట్యం లాంటి శాస్త్రీయ నృత్యాలు దేశ ఔన్నత్యాన్ని కాపాడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ జూనియర్ కళాశాల చైర్మన్ బొల్లాపల్లి సుధాకర్, నృత్య గురువు డా. విశ్వకర్మ ఇందిరా పరశురాం, రమనీసిద్ధి, రాజేశ్వరి, ప్రకాష్, రవి, మౌనిక పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



ఖేడ్‌లో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో ఖేడ్ పట్టణంతోపాటు, మాయికోడ్‌కు చెందిన పలువురికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులు, వాసర్‌కు చెందిన సాగర్‌కు ఎల్‌వోసీ ఉత్తర్వులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బోజిరెడ్డి, టీపీసీసీ సభ్యులు మున్నూరి కిషన్, సిర్గాపూర్ మాజీ సర్పంచ్ స్వప్న, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, ముంతాజ్ పాల్గొన్నారు. కాగా ఖేడ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఆదర్శ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందులో బ్యాంకు సీఈవో వెంకట రమణ, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అది రైతు దీక్ష కాదు.. బీఆర్ఎస్ ఉనికి దీక్ష

- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీ అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్



నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ముఖ్య నాయకులు

నర్సాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కొల్చారంలో చేసిన దీక్ష రైతుల కోసం కాదని, బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునేందుకు చేసిన దీక్ష అని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి విమర్శించారు. ఆదివారం నర్సాపూర్‌లోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తూనే.. మరోవైపు హామీలను అమలు చేస్తుందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నదని, అందులో భాగంగానే రైతు దీక్ష చేశారన్నారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి వారు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, పార్టీ మండలాధ్యక్షులు మల్లేశం, శ్రీనివాస్ రావు, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, మాజీ ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుజాత, నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖర్గే సూచించారని ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు అక్కడి నాందేడ్ పార్లమెంట్ స్థానానికి ఉప ఎన్నిక ఈ నెలల జరగనున్నది. ఈ క్రమంలో ఆదివారం నాగ్‌పూర్‌లో ఎన్నికల మేనిఫెస్టోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే విడుదల చేశాడు. అనంతరం నిర్వహించారు. జూమ్ మీటింగ్‌లో నాందేడ్‌పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థితోపాటు ఆ పార్లమెంట్ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాల అభ్యర్థులతో కలిసి షెట్కార్ పాల్గొన్నారు.

బీసీలకు కాంగ్రెస్ పెద్దపీట

- కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు



దత్తాచల క్షేత్రంలో పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న నీలం మధు

హత్నూర/జిన్నారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్నిరంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు అన్నారు. ఆదివారం మాధుర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రంలో దత్తాత్రేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రాధిపతి సభాపతిశర్మ మధుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు దేశంలో కూడా కులగణన జరిగితే బీసీలకు, బడుగు, బలహీనవర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్, కాంగ్రెస్ నాయకులు సత్యం, పెంటయ్య, నరేందర్, మణిదీప్,పోచయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొందిన జిన్నారం మండలం సోలక్‌పల్లికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిని నీలం మధు పరామర్శించారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

- పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఖేడ్‌లోని రాజీవ్‌చౌక్, మంగల్‌పేట్ బస్టాండ్ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బీడీ, సిగరేట్ తాగడం, దర్గా, తంబాకు, గుట్కా, పాన్ మసాలాలను వినియోగించడం వల్ల అనేక నష్టాలు చోటు చేసుకుంటాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగరాదని, ఎవరైనా తాగితే సెక్షన్ 4 ప్రకారం నేరమని, రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు బోజయ్య, రవికుమార్, ఇసాక్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య



అల్లాదుర్గం మండలం మాందాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య

అల్లాదుర్గం/నాగల్‌గిద్ద/తూప్రాన్/వెల్దుర్తి/పెద్దశంకరంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం అల్లాదుర్గం మండలం మాందాపూర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి గ్రామంలో జరుగుతున్న సర్వేను ఖేడ్ ఆర్డీవో అశోకచక్రవర్తి ఆదివారం పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ శివరామక్రిష్ణ, సూపర్‌వైజర్ రవీందర్‌రావు, కార్యదర్శి శరత్ ఉన్నారు. తూప్రాన్ పట్టణం, మాసాయిపేట మండలం రామంతాపూర్, లింగారెడ్డిపల్లిలోని సర్వేను ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. వెల్దుర్తి మండల పరిధిలోని హస్తాపూర్‌లో సర్వే ప్రక్రియను ఎంపీవో విఘ్నేశ్వర్ పరిశీలించారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్‌లో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ పరిశీలించారు.

'కుటుంబ సర్వేలో కురుమలంతా పాల్గొనాలి'

నారాయణఖేడ్, నవంబరు 10: ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సర్వేలో కురుమలంతా పాల్గొనాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్ శెట్టి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో మాట్లాడారు. కులం స్థానంలో కురుమ, బీసీ(బీ), క్రమ సంఖ్య 11, కాపరులు తమ వృత్తి గొర్రెల కాపరి అని నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సర్వేలో వీరశైవ లింగాయత్‌లు కోడ్ 115గా నమోదు చేసుకోవాలి

అల్లాదుర్గం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కులగణన సర్వేలో వీరశైవ లింగాయత్/లింగబలిజలందరు కులం కోడ్‌లో 115గా నమోదు చేసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అడికే జగదీశ్వర్ కోరారు.

ఎన్యుమరేటర్లకు పని భారం తగ్గించండి

సంగారెడ్డి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కులగణన సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లుగా నియమించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పని భారాన్ని తగ్గించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు ఆదివారం డిమాండ్ చేశారు. ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచి ఒక్కొక్కరికి 150 నుంచి 200 కుటుంబాలను కేటాయించడంతో భారంగా మారుతుందన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు వందమందిలోపు కుటుంబాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్యుమరేటర్లకు సహకరించాలి: చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లు, అధికారులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ కోరారు. సర్వేలో భాగంగా ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్యుమరేటర్లతో కలిసి చైర్మన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బంది అడిగిన వివరాలను వారికి చైర్మన్ అందజేశారు. ఈ సర్వేలో కమిషనర్‌తో పాటు మేనేజర్ భవాని, ఆర్ఐ జానయ్య మెప్మా అధికారులు సునీత పాల్గొన్నారు.

విద్యార్థుల అస్వస్థతపై ఆర్సీవో ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ శివారులోని జ్యోతి బాపూలే బీసీ గురుకులంలో విద్యార్థుల అస్వస్థతకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 9న ప్రచురితమైన కథనానికి ఆర్సీవో సంతోషి స్పందించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. కాగా విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి బీసీ గురుకుల కార్యదర్శి సైదులుకు, ప్రిన్సిపాల్‌కు ఆర్‌వో ప్లాంటుకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

చిన్నశంకరంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఓటరు లిస్టులో తమ పేర్లు తప్పులు దొర్లితే సరిచేసుకునేందుకు ఆస్కారం ఉందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్ సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో తనిఖీ



కమలాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయ్

పెద్దశంకరంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్, రామోజీపల్లి వీరోజిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గ్రేస్‌బాయ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసేలా చూడాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.

'దొడ్డు రకం ధాన్యానికీ బోనస్ చెల్లించాలి'

నారాయణఖేడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ చెల్లించాలని సీపీఎం ఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం దొడ్డురకం ధాన్యం సాగుచేసిన రైతుల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్, ఖేడ్, సిర్గాపూర్, కల్హేర్, మండలాల్లో వరి పంటను అధికంగా సాగు చేస్తారన్నారు. అందువల్ల సన్నరకం ధాన్యానికే కాకుండా, దొడ్డురకం ధాన్యానికి కకూడా బోనస్ చెల్లించాలన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు సతీష్, అర్జున్, మహిపాల్ ఉన్నారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయిభాషా



సాయిభాషాకు నియామకపత్రాన్ని అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయిభాషా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రాన్ని అందజేశారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల ఇన్‌చార్జిగా సాయిభాషానే ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ప్రదీప్‌కుమార్



ప్రదీప్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ఇరుకుల ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా గవర్నర్‌గా(వి105ఎ) ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్, ఉమ్మడి రంగారెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ల పరిధిలోని 102 క్లబ్‌లలో సేవా కార్యక్రమాలు విస్తృతం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేతకీలో కార్తీకమాస పూజలు



ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఝరాసంగం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పంచలక్ష పుష్పార్చన



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని సీతారామ శివాంజనేయ క్షేత్రంలో పుష్పార్చన చేస్తున్న భక్తులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని సీతారామ శివాంజనేయ క్షేత్రంలో ఆదివారం పంచలక్ష పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు గణపతి పూజ మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, పంచలక్ష పుష్పార్చన, మహా హారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.